క్లుప్తంగా

ప్రతిభ కనబరిచి.. రాష్ట్ర స్థాయికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

దండేపల్లి: ఆర్థిక అక్షరాస్యత అవగాహనలో భాగంగా ఆర్బీఐ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాంకు వ్యవస్థ, ఆర్థిక రంగం అనే అంశాలపై రాత పూర్వక క్విజ్ పోటీలను, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించారు. దీనిపై మండల, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో దండేపల్లి మండలం వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొంతం శ్రీ వైష్ణవి, బండె దీక్షిత ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్ఎం గాయిత్రీ, ఉపాధ్యాయులు పాఠశాలలో బుధవారం సన్మానించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



దుకాణ సముదాయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బుధవారం ప్రారంభించారు. మహాలక్ష్మీవాడ, గోదావరి రోడ్‌లో నూతనంగా డీఎంఎఫ్టీ నిధులతో మంజూరైన రోడ్డు పనులను ప్రారంభించారు. కళాశాల మైదానంలో నూతనంగా నిర్మిస్తున్న మినీ స్టేడియం పోడియం కాంప్లెక్స్ భవనంలోని దుకాణ సముదాయాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యాల కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణాధ్యక్షులు శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలన రావాలంటూ పాదయాత్ర



స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్‌నాయకులు

రామకృష్ణాపూర్: తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ చక్కటి పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మహారాష్ట్రలోనూ రావాలని ఆకాంక్షిస్తూ ఆ రాష్ట్రానికి చెందిన దంపతులు చేపట్టిన పాదయాత్ర బుధవారం గద్దెరాగిడి ప్రాంతానికి చేరుకుంది. స్థానిక బీఆర్ఎస్ నాయకులు దంపతులు బాబురావు– శోభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ప్రగతిభవన్ వరకు యాత్ర సాగించనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో సీటు



తోకల శృతి

వేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన తోకల శృతి అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకుంది. తండ్రి మధునయ్య తొమ్మిది సంవత్సరాల క్రితం మృతి చెందగా, తల్లి శంకరమ్మ కూలీ పనులు చేస్తూ కూతురిని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదివిస్తోంది. పదో తరగతి ఫలితాల్లో 9.7జీపీఏ సాధించగా మెరిట్ ఆధారంగా ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకుంది. విద్యార్థినిని హెచ్ఎం, ఎంఈఓ తిరుపతిరెడ్డి, స్థానిక సర్పంచ్ కుబిడె మధుకర్, గ్రామస్తులు అభినందించారు.

సన్మానం

మంచిర్యాలటౌన్: పట్టణానికి చెందిన డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు కాంగ్రెస్‌లో చేరి, మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేవీ ప్రతాప్ బుధవారం స్వాగతం పలికి, సన్మానించారు.

అవగాహన



చెన్నూర్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పథకాలు చేపట్టి అమలు చేస్తుందని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని సుద్దాల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుదవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఉపసర్పంచ్ కాటవేణ రవియాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



బయోమెట్రిక్ యంత్రంలో వివరాలు నమోదు చేస్తున్న టెక్నీషియన్

ఫేస్ రికగ్నైజేషన్ నమోదు

మళ్లీ బయోమెట్రిక్!

- మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో అమలుకు నిర్ణయం
- మున్సిపల్ కార్యాలయంతోపాటు వివిధ చోట్ల ఏర్పాటు
- ఇక నుంచి పక్కాగా అధికారులు, సిబ్బంది, కార్మికుల హాజరు

మంచిర్యాలటౌన్: జిల్లాలోనే గ్రేడ్ 1 మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఉన్న మంచిర్యాల మున్సిపాలిటీలో కొన్నేళ్ల తరువాత బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొట్టమొదటి సారిగా 2016అక్టోబర్ 2వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో బయోమెట్రిక్ విధానాన్ని ప్రారంభించిన సమయంలో మంచిర్యాలలో సైతం ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయానికి హాజరయ్యే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు, ఇతర టెక్నీషియన్లు సమయపాలన సక్రమంగా పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. కొద్ది రోజులకే బయోమెట్రిక్ మిషన్లు పాడవడంతో, వాటికి మరమ్మతు చేయించలేక మూలనపడేశారు. హాజరును పకడ్బందీగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా, బయోమెట్రిక్ మెషిన్లు పనిచేయకపోవడం, ఆ తరువాత కరోనా నేపథ్యంలో వీటిని పక్కన పడేయంతో, కొన్నేళ్లుగా రిజిష్టరులోనే హాజరు సంతకాలు చేస్తున్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు సమయపాలన పాటించకుండా ఇష్టమైన సమయాల్లో కార్యాలయానికి రావడం, వెళ్లిపోవడం చేస్తున్నారు. వీరిపై నియంత్రణ లేకపోవడంతో ఉదయం 10గంటలకు కార్యాలయానికి రావాలిస్న ఉద్యోగులు సమయానికి హాజరు కాకపోవడంతో, మున్సిపల్ కార్యాలయం వెలవెలబోతుంది. ఉదయం 11గంటల తరువాతనే సిబ్బంది హాజరవుతుండడంతో, ఆన్‌లైన్ ద్వారా హాజరును పకడ్బందీగా చేపట్టేందుకు మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ చర్యలు చేపట్టారు. ఇందుకోసం మున్సిపల్ ఉద్యోగులు పనిచేసే అన్నిచోట్ల బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం 10బయోమెట్రిక్ యంత్రాలు

మున్సిపల్ కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగులు, కార్యాలయంలోని సిబ్బంది కోసం కార్యాలయంలోనే ఒక బయోమెట్రిక్ యంత్రం, పట్టణానికి తాగునీటిని అందించే ముల్కల్ల పంప్‌హౌజ్ వద్ద ఒక యంత్రం, మిషన్ భగీరథ తాగునీటిని అందించే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మరో యంత్రం, డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ఉన్న తాగునీటి ట్యాంకు వద్ద ఒక యంత్రంను, పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్న చోట ఆరు యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్‌తో పాటు, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు మొత్తం 428మందికి సంబంధించిన వేలిముద్రలు, ఐరిష్, ఫేస్ రికగ్నైజేషన్‌ను సేకరించి, ఆయా యంత్రాల్లో నిక్షిప్తం చేస్తున్నారు. నాలుగైదు రోజుల్లో అందరి వివరాలను నమోదు చేసిన అనంతరం, ఇకపై బయోమెట్రిక్ ద్వారానే హాజరు తీసుకోనున్నారు. దీనిని అమల్లోకి తీసుకొస్తే, కార్యాలయం ప్రారంభ సమయానికి ముందే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు హాజరై బయోమెట్రిక్‌లో ఐరిష్, ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా హాజరును నమోదు చేసుకోవడం, సమయం ముగిసిన తరువాతనే మరోసారి వెళ్లిపోయే ముందు ఐరిష్ ద్వారా నమోదు చేసి వెళ్లిపోవాల్సిందే. ఇది అమల్లోకి వస్తే, ఉద్యోగులు ఇష్టారీతిన కార్యాలయానికి, విధులకు హాజరు కావడంకు చెక్ పడినట్లే.

సమయపాలన పాటించాలనే..

కరోనా సమయంలో బయోమెట్రిక్ విధానానికి స్వస్తి పలికి, ఆ తరువాత రిజిష్టరులోనే హాజరును నమోదు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీలోని అన్ని రకాల ఉద్యోగులు, కార్మికులకు ఇకపై బయోమెట్రిక్ ద్వారా హాజరును నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాం. నాలు గైదు రోజుల్లో ఉద్యోగులు, కార్మికుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే, అమల్లోకి తీసుకొస్తాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

నేటి నుంచి గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న సిబ్బంది

తాండూర్: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె గురువారం నుంచి చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి దాగం రాజారాం తెలిపారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలం నుంచి పంచాయతీ కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలనే డిమాండ్లతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు అంజద్ హుస్సేన్, రహీం, వంశీ, చంద్రశేఖర్, దుర్గమ్మ, ప్రమీల, సునీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

కోటపల్లి: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని మండలంలోని పంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీవో భాస్కర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ వర్కర్లు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి పంచాయతీ కార్మికులకు జీవో 60ప్రకారం వేతనాల పెంపు మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీస్‌లో పెట్టిన డిమాండ్లను పరిష్కరించని యెడల ఈ నెల 6నుంచి సమ్మెలో వెళ్లనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మహేశ్, వినోద్‌కుమార్, వెంకటేశం, రామచంద్రయ్య, వెంకటరాజం, యాదయ్య పాల్గొన్నారు.

పోస్టాఫీసులో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

బెల్లంపల్లి: బెల్లంపల్లి పోస్టాఫీసులో బుధవారం ఆధార్ నమోదు కేంద్రంను ఏర్పాటు చేయగా బెల్లంపల్లి సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్స్‌స్పెక్టర్ సిరికొండ సతీష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెల్లంపల్లి పట్టణ పరిసర ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆధార్‌కార్డులో సవరణలు, కొత్తగా ఆధార్‌కార్డు నమోదు చేయడం వంటి సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో గోరింటాకు పండుగ



చెన్నూర్: పట్టణంలోని కస్తూర్బా కళాశాలలో గోరింటాకు పండుగను విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆనందోత్సహాల మధ్య నిర్వహించుకున్నారు. గోరింటాకు తీసుకొచ్చుకొని తయారు చేసి, చేతులకు అలంకరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుమలత మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్య రిత్యా మంచిదన్నారు. గోరింటాకు పండుగతో కొత్త విద్యార్థులు, పాత విద్యార్థినుల్లో స్నేహ భావం పెంపొందుతుందన్నారు.

'కాంగ్రెస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి'



భీమారం: బైక్ ర్యాలీలో పాల్గొన్న రాజారమేశ్

చెన్నూర్/భీమారం/జైపూర్: కాంగ్రెస్‌తోనే చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకుడు డాక్టర్ రాజారమేశ్ అన్నారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన బుధవారం జైపూర్ మండలం ఇందారం నుంచి చెన్నూర్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చెన్నూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి మాట్లాడారు. ప్రజలకు సేవ చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వచ్చానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోటు రాంరెడ్డి, గజ్జెల అంకగౌడ్, చెన్నూరి శ్రీధర్, పాతర్ల నాగరాజు, కృష్ణగౌడ్, నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బోనాల జాతర

చెన్నూర్: పట్టణంలో గల మడేలేశ్వర బోనాల జాతరను రజక కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. రజక వాడ నుంచి బోనాలతో మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. రజకుల ఆరాధ్య దేవుడైన మడేలేశ్వర బోనాల జాతర ఆషాఢ మాసంలో ఆనావాయితీగా వస్తుందని రజక కులస్తులు నిమ్మల మధు, పోచం, వెంకటరాజం తెలిపారు.

ఘనంగా ఎస్కేబీఎస్ ఆవిర్భావ దినోత్సవం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి కార్మిక బిడ్డల సంఘం(ఎస్కేబీఎస్) 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద గల కార్మిక విగ్రహానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్ పూలమాలవేసి అమర కార్మికులకు నివాళులర్పించారు. కార్మిక వర్గ సమస్యల కోసం ఎస్కేబీఎస్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దూట లింగస్వామి, నాయకులు సత్యం, శ్రీనివాస్, శివకుమార్, అరుణ్, దామోదర్, శ్రావణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

- మందమర్రిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోల్ల నరేష్, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, పట్టణ అధ్యక్షుడు సతీష్‌బాబు పాల్గొన్నారు.

అన్ని సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలపై చర్చించడానికి అన్ని జాతీయ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని నాయకులు కోరారు. ఆర్కే న్యూటెక్ గనిపై బుధవారం ఆ సంఘాల నాయకులు రక్షణాధికారి రమేష్‌ను కలిసి ఈ డిమాండ్‌పై వినతి పత్రం సమర్పించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసింది అన్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు అన్ని సంఘాలను సమానంగా చూస్తామని, సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామని కంపెనీ డైరెక్టర్ బలరాం నాయక్ హామీ ఇచ్చారని, కానీ స్థానిక యజమాన్యం పాటించడం లేదన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలపై చర్చించడంలోనూ, మైన్స్, సేఫ్టీ కమిటీలో మాట్లాడేందుకు అన్ని సంఘాలను పిలవాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు నాతాడి శ్రీధర్ రెడ్డి, తలారి వినయ్‌కుమార్, రాగం రాజేందర్, మేకల స్వామి, ఏఐటీయూసీ నుంచి ఆకుల స్వామి, రమేశ్, సందీప్‌కుమార్, సీఐటీయూ నుంచి చంద్రశేఖర్, అజయ్, సదానందం, ఐఎన్టీయూసీ మహేందర్, హెచ్ఎమ్మెస్ నాయకులు కిరణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

'నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలి'

మందమర్రిరూరల్: నిబంధనల ప్రకారం సింగరేణిలో ఒప్పంద కార్మికులకు వేతనాలు చెల్లించకుండా, వారి పొట్టకొడుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిల్ల రాధిక ఆరోపించారు. ఏరియాలోని కేకే–ఓసీ వద్ద బుధవారం కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకుంటే, దశలవారీగా ఆందోళనలు చేయడానికి వెనుకాడేది లేదని యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఓసీ కాంట్రాక్ట్ కార్మికులు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

శ్రీరాంపూర్: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనిపై బుధవారం వర్షాకాలంలో వచ్చే జబ్బులపై అవగాహన కల్పించారు. ఈ సీజన్‌లో డెంగీ, మలేరియా,చికెన్ గున్యా, అతిసారం వ్యాధులు వస్తాయని, వీటిని రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం గని మేనేజర్ సుధీర్ జక్కులవార్ పాల్గొని విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. గని రక్షణాధికారి శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు మల్లారెడ్డి, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరే టీచర్.. 30మంది పిల్లలు

- ఉపాధ్యాయురాలు సెలవుపెడితే బోధించే వారు కరువు



ఉపాధ్యాయురాలు సెలవు పెట్టడంతో తరగతి గదిలో ఆడుకుంటున్న పిల్లలు

జైపూర్: మండలంలోని శివ్వారం పాఠశాలలో 30మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉన్నారు. ఆమె సెలవులో ఉన్న రోజు, విద్యా కార్యక్రమాలు, సమావేశాల నిమిత్తం పాఠశాలకు హాజరు కాకపోయినా విద్యార్థులకు బోధించే వారు కరువవుతున్నారు. ఉపాధ్యాయురాలు అనారోగ్యం నిమిత్తం బుధవారం సెలవు పెట్టగా విద్యార్థులు స్కూల్లో ఆడుతూ కనిపించారు. రూ.లక్షలు వెచ్చించి బడులు బాగు చేస్తున్నప్పటికీ, మారుమూల ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతపై అధికారులు శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

'దోపిడీని అరికట్టాలి'

మంచిర్యాలఅర్బన్: కార్పొరేట్ పాఠశాలల విచ్చలవిడి దోపిడీని అరికట్టాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది పేరెంట్స్ కమిటీ అనుమతి లేకుండా ఫీజులు పెంచుతున్నారని విద్యార్థి సంఘాల బాధ్యులు శ్రీనివాస్, సల్మాన్‌పాషా, వంశీతో పాటు పలువురు ఆరోపించారు.

'హరితహారం' లక్ష్యం పూర్తి చేయాలి

కాసిపేట: అన్ని గ్రామపంచాయతీల్లో హరితహారం లక్ష్యాన్ని శనివారంలోపు పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.ఏ.ఆలీం సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయడం పూర్తి చేయాలని, రిజిస్టర్‌లో నమోదు చేసి ఈ పంచాయతీ పోర్టల్‌లో ఎంట్రీ చేయాలన్నారు. నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవనాలకు భూమిని గుర్తించి ని ర్మాణం ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఓ నవీన్, ఎంపీఓ నాగరాజు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన నటరత్న యూత్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులందరూ రక్తదానం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. యూత్ ఉపాధ్యక్షుడు గాండ్ల గణేష్ బుధవారం 28వ సారి రక్తదానం చేశాడు. గోదావరిఖనికి చెందిన మల్లయ్య గుండె చికిత్స కోసం హైదరాబాద్ కేర్ ఆసుపత్రిలో చేరగా, చికిత్స నిమిత్తం అతడికి రక్తం అవసరమని చెప్పడంతో గణేష్ ముందుకొచ్చి రక్తదానం చేశాడు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూర్: వైద్యుడి నిర్లక్ష్యంతో అకాల మృతి చెందిన మూడు నెలల చిన్నారి శిశువు కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ శ్రేణులు పరామర్శించారు. తాండూర్ మండల కేంద్రం ఐబీ కొత్త గుడిసెల ప్రాంతానికి చెందిన జాడి కిషన్, కళావతి దంపతులను కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, ఇతర నాయకులు పరామర్శించి జరిగిన ఘటనను అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వైద్యం చేసిన నిత్య ఆసుపత్రి వైద్యుడిపై చర్యలు తీసుకునేలా వ్యవహరిస్తామని తెలిపారు. అనంతరం స్వామి రూ.5వేలు నగదు సాయం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, కాంగ్రెస్ నాయకులు బండి ప్రభాకర్, మల్లేష్, ఎండి అఫ్జల్, లక్ష్మణ్, గౌస్, సమ్మిరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

దండేపల్లి: మండలంలోని గూడెం, రంగంపల్లె, నంబాల, వెల్గనూర్ పాఠశాలల్లో మన ఊరు–మనబడి పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంఈవో రవీందర్ బుధవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత

దండేపల్లి: మండలంలోని గూడెం, వెల్గనూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పంపిణీ చేశారు.

సైడ్ డ్రెయిన్ పనులు ప్రారంభం

వేమనపల్లి: కేతన్‌పల్లి గ్రామంలోని పినుమళ్ల పెంటయ్య ఇంటి నుంచి బంజరుదొడ్డి వరకు రూ.5లక్షల జెడ్పీ నిధులతో సైడ్ డ్రెయిన్ పనులను జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తాండూర్: మండలంలోని రేచిని గ్రామపంచాయతీ భవనం నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు కాగా ఎంపీపీ ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ బానయ్య, సర్పంచ్ దుర్గుబాయి బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రాజీవ్‌నగర్‌లో రూ.2లక్షలతో నిర్మించే మురికినీటి కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఎస్సీ హాస్టల్‌లో, బీసీ విద్యార్థులను చేర్చుకోవాలని వినతి

కోటపల్లి: మండలకేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో బీసీ విద్యార్థులను చేర్చుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డికి బుధవారం ఎంపీపీ మంత్రి సురేఖా వినతిపత్రం అందజేశారు. కోటపల్లి మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బాలురకు హాస్టల్ వసతి లేనందునా, కోటపల్లి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో బీసీ విద్యార్థులకు వసతి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటే బీసీ విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉంటారని తెలిపారు.

సామగ్రి అందజేత

జైపూర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఏటా లయన్స్ క్లబ్ ద్వారా చేయూతనందిస్తున్నట్లు మంచిర్యాల లయన్స్ క్లబ్ సీనియర్ లయన్ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇందారం దొరగారిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందజేశారు.

అధిక ఫీజులు నియంత్రించాలని ధర్నా



బెల్లంపల్లి: విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఎంఈవో కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. ఫీజులను నియంత్రించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎఈవో కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు రాజు, సంజయ్, సాయి గణేష్, ఇంద్రనీల్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.